# శకలాల క్రింద...

చుట్టూ ముళ్లతీగె పహరా కాస్తోంది. ఆ ముళ్ళతీగెలో అక్కడక్కడా చీమల పుట్టలు. ఆ పుట్టలపై బొమ్మజెముడు పొదలు-రక్కసి చెట్లు. వేళ్ళులేని మొండి చేతుల్లా వికృతంగా వాటి ఆకులు. అరచేతిలాంటి ఆ ఆకుల్లో ముళ్ళు. నిండు వేసవిలో కూడా పచ్చగా వుండి మనుగడకై పోరాటం సాగిస్తూన్న వృక్ష సంతతి. ముళ్ళతీగె లోపల తమ ఆశ్రమం. ముళ్ళతీగె ఆవల నగరం.

ఆకాశంలోకి చొచ్చుకుపోయిన పొగ గొట్టాలు, బహుళ అంతస్థుల భవనాలు దానికి సంకేతాలుగా వున్నాయి. కొండల పైన, గుట్టలపైన వెలిసిన సువిశాలమైన మేడల మధ్య చీమల్లా కదుల్తూన్న వాహనాలు. సిమ్మెంటు, ఇసుక, ఇటుకలతో బలిసిపోతూన్న నగరం "ఆక్టోపస్" లా చేతులు చాపి చాపి పొలిమేర్లలోని చిన్న చిన్న గ్రామాలను కబళించి, కబళించి తమ ఆశ్రమందాకా వచ్చింది.

నగరపు శివార్లలోని మట్టి ఇళ్ళు-అందమైన శరీరాన్ని వికృతం చేస్తూన్న కురుపుల్లా వున్నాయి. రేకులతో కప్పబడి రాళ్ళతో బరువులు పెట్టబడిన కొంపలు. వాటి ద్వారాలను చివిగిన గోనె సంచులు కాపాడుతున్నాయి. ఆ ఇళ్ళముందు జిబ్బరినెత్తితో వున్న ఆడంగులు, మట్టికుండలు చేతుల్లో పట్టుకొని "బోరింగ్" — వద్ద మంచినీళ్ళకోసం పోట్లాడుకుంటున్నారు.

"ఓ సత్తెమన్నా...గిటు షూడు...అటెటోసూత్తన్నావ్... సక్కంగా వుందా సూడు" ... బొంగులు పాతుతూన్న జనంలో నుండి ఒకరు సత్యం దృష్టిని మళ్ళించారు. ముళ్ళ తీగెల ఆవల వున్న దృశ్యాలను పరాగ్గా చూస్తూన్న సత్యం తన దృష్టిని మరల్చుకొన్నాడు.

"ఈ బొంగు అటు తూలింది...కొద్దిగా ఇటు జరపండి..." ఆ...రైట్...స్ట్రెయిట్‌గా వుంది...ఇకచాలు... ఇకచాలు...ఆపైన స్వాగతం - ఆ బట్టకట్టి, రంగు కాగితాలు కట్టిన తాళ్ళు మన హాలు దాకా కట్టండి"...పని పురమాయించి ఆవరణంతా కలయచూశాడు.

ఆవరణంతా చక్కగా ఊడ్చి శుభ్రంగా వుంది.

గేటుముందు ఎండుటాకులూడుస్తూన్న ఆడవాళ్ళు. నీళ్ళు చల్లి చదును చేస్తున్నారు మగవాళ్ళు. జట్లు జట్లుగా పనులు చేస్తూన్న వాళ్ళ ముఖాలలో వెలుగులు ఎవరో వస్తారని, ఏదో చేస్తారన్న ఆకాంక్ష.

ఆశలు చిగురించని జీవితాలు-శాశ్వతంగా మోడువారిన బ్రతుకులు. కొత్తదనం లేని జీవితాలు.

"సత్యమూర్తీ...ఈ రోజు మన వద్ద కొచ్చేవాళ్ళు మన కేమిచ్చిపోతారో నీకేమైనా తెలుసా?"...ఒక వృద్ధ కంఠం ప్రశ్నించింది.

"ఏమిస్తారు...ఆడమనిషి కొక చీరె...మగాడి కొక ధోవతి...ఆశ్రమానికి కొంత విరాళం...అంతకన్నా ఎవరైనా ఏమిస్తారు...అంతకన్నా ఎక్కువ మీ కేం కావాలి" ...నిరాశ నిస్పృహలతో సమాధానమిచ్చి అందర్నీ పరీక్షగా చూశాడు.

చిరునవ్వుతో ఆ సమాధానం విని, ఆశ్రమాన్ని అలంకరించడంలో మునిగిపొయ్యారు వాళ్ళు.

కొందరు మెయిన్ హాలు ద్వారానికి తోరణాలు కడుతున్నారు.

తోరణాలు-మామిడాకు తోరణాలు — వాసనలేని, వాడిపోని మామిడాకులు—ప్లాస్టిక్ మామిడాకులు. ఆ తోరణాలపై దేవుని బొమ్మలు అసహజంగా వున్నాయి.

అలంకరణ పూర్తయింది.

సాయంత్రం అయిదు గంటలవేళ.

అనుకున్న సమయానికి, ఆశతో ఎదురుచూస్తూన్న చిన్నకార్లు లోనికొచ్చాయి. డ్రైవర్స్ డోర్స్ తీశారు. పెద్ద మనుషులు దిగారు.

ఒకరు ఆరోగ్య శాఖ మంత్రి. తెల్లని లాల్చీ, పైజమా. గంజిపెట్టిన లాల్చీ కొసలు చాకుల్లా వున్నాయి. రెండవ వ్యక్తి హైకోర్టు జడ్జి — పాంటు, బంగారు రంగు జోథ్‌పూర్ కోటు. అతనితోపాటు అతని అర్ధాంగి కూడా కారు దిగింది —పమిట చెరుగు భుజాలపై కప్పుకొని.

గులాబీరంగు పట్టుచీరె. అస్తమిస్తూన్న సూర్యబింబంలా నుదిటిపై గుండ్రని బొట్టు. ఆమె ధరించిన గోల్డ్ రిమ్‌డ్ కళ్ళద్దాలు సూర్యకాంతిలో ధగధగ మెరుస్తున్నాయి. ముగ్గు బుట్టలాంటి తల. ఆమె హావభావాలలో గొప్పింటి మహిళా లక్షణాలు.

రెండు టూరిస్ట్ బస్సుల నిండా సంఘసేవకులు, సంస్కర్తలు, స్వచ్ఛంద సేవకులు వచ్చి బిలబిలమంటూ బస్సులు దిగారు. "నమస్తేలు" — పలకరింపులు ముగిశాయి.

"మనం ఈ ఆవరణంతా ఒక్కసారి తిరిగివద్దాం" — మంత్రిగారు సెలవిచ్చారు. ఆశ్రమ నిర్వాహకులు, డాక్టర్లు, వచ్చిన అతిథులన్నూ దర్శకులను వెంబడించారు. ఆశ్రమ వాసులు ఆ ఉన్నత తరగతి వ్యక్తులకు కొద్ది దూరంలో వెనుక నడువసాగారు.

"ఈ రంగు రంగు గులాబీలు...ఈ మల్లెలు...ఈ గార్డెనంతా వీరు శ్రమపడి తయారు చేసిందేనా?..."మంత్రి గారి పొగడ్తలు.

"అవునండీ...ఈ పూలన్నీ ప్రతిరోజూ 'సిటీ'కి పంపిస్తాం. రోజుకి ఎనభై రూపాయిల నుండి నూట ఇరవై రూపాయిల దాకా ఆదాయముంటుంది" — సెక్రటరీగారి ఆర్థికపరమైన అవగాహన.

"ఆశ్రమంలో 'బోర్‌వెల్' వుంది. ఈ 'బోర్‌వెల్' ఆధారంగా టొమాటో, బీన్స్ మొదలైన కాయగూరలు పండిస్తాము. వర్షాకాలం ఐదెకరాల 'వరి' సాగవుతుంది. ...ఇవిగో ఇవి వరిమళ్ళు...సెక్రటరీ చూపించసాగాడు.

ఆవరణలోని చెట్టూ, చేమా తిరగడం అయిపోయింది. అందరూ గడియారాలు చూసుకొన్నారు.

"ఆ కనిపించే చిన్న చిన్న పెంకుటిళ్ళు వీరికే గదా?" ...జడ్జిగారు—చూపుడు వేలు గాలిలో ఆడిస్తూ-అడిగారు.

"అవునండీ-ఈ జబ్బు నయమయినవాళ్ళు చాలామంది తమ తమ ఇళ్ళకెళతారు. బహు కొద్దిమంది ఇక్కడుంటారు...ఉన్నవాళ్ళకు ఈ ఇళ్ళు కేటాయిస్తాం..." సెక్రటరీ చెప్పుకుపోతున్నాడు.

అందరూ తిరిగి మెయిన్ హాలులోకి నడిచారు.

అందులో చిన్న హస్తకళల ప్రదర్శన అందంగా వివిధ రకాల డిజైన్లలో అల్లిన ప్లాస్టిక్ బుట్టలు - ప్లాస్టిక్ దారంతో అల్లిన కుర్చీలు - కాగితపు కత్తిరింపులు మొదలైన హస్తకళలు.

"ఈ అల్లికలు నేర్పించడానికి, వీళ్ళకు టీచర్‌గానీ, ఇన్‌స్ట్రక్టర్ గానీ వున్నాడా ఇక్కడ" — జడ్జిగారి ప్రశ్న.

"అటువంటి వారెవ్వరూ లేరిక్కడ...కానీ మా ఆశ్రమంలో ఒక తెలివైన, చురుకైన వ్యక్తి వున్నాడు. అతనే ఇవన్నీ నేర్పిస్తాడు. ఆసక్తి వున్నవాళ్ళకు చదువు కూడా చెబుతాడు..."

"అయితే మీరు అతనిని రెగ్యులర్ టీచర్‌గా అపాయింట్ చేస్తే ఇంకా ఉత్సాహంగా పనిచేస్తాడేమో"...

"చేస్తామని చెప్పాం... అతను ససేమిరా వద్దన్నాడు. నాకు భార్యా పిల్లలూ లేరు. నా కెందుకు జీతమని వాదించాడు. ఎక్కడో పుట్టిన తెల్లదొరలు మన దేశ ప్రజల కోసం హాస్పిటల్స్, ఆశ్రమాలు నెలకొల్పి పొయ్యారు... మానవత్వం పరిమళించే వారి ఆదర్శాలను మనం ముందుకు తీసికెళ్ళాలి...దీనికి ప్రతిఫలం కోరకూడదని అతని వాదన" — సెక్రటరీ మాటల్లో ఆనందోద్రేకాలు.

"అంకితమైన వ్యక్తి...ఎవరాతను?...చూద్దాం" ఉత్సాహంతో అడిగారు మంత్రిగారు ఇంగ్లీషులో.

"దట్స్ గుడ్...వీళ్ళలో చదువుకొన్నవాళ్ళుంటారనే విషయం నేను మొదటిసారిగా వింటున్నాను" జడ్జిగారన్నారు.

"అతను పేషెంటేనా?" ఆమె అంది.

"ఇప్పుడు పేషెంట్ కాదు. అతను బి.ఎ. చదువుతూన్న రోజుల్లో ఈ వ్యాధికి గురయ్యాడు. పదమూడు సంవత్సరాల క్రితం ఈ ఆశ్రమంలో చేరి ఐదు సంవత్సరాలు ఓపిగ్గా కంటిన్యూయస్‌గా మందులువాడి 'క్యూ'రయ్యాడు. ఆరోగ్య

తేజోగిరి పోతరాజు

వంతుడైన తరువాత కూడా ఈ ఆశ్రమం విడిచి వెళ్ళలేదు. గత ఏడెనిమిది సంవత్సరాలుగా ఈ సంస్థకు ఎంతో సేవ చేస్తున్నాడు''.

''ఏదీ...అతన్ని చూద్దాం...వీళ్ళలో వున్నాడా?'' — జడ్జిగారి భార్యకు కుతూహలం. ఆశ్రమవాసులందర్నీ పరిశీలనగా చూడసాగింది.

''సత్యం...ఇప్పటి వరకూ ఇక్కడే వున్నాడు...ఎక్కడికి పోయాడబ్బా'' డాక్టర్ అన్నాడు.

''పోయి పిలుచుకురండి ఎవరైనా? తన రూమ్‌లో వుండవచ్చు'' సెక్రటరీ అన్నాడు.

* * *

సత్యం-ముళ్ళతీగెపై ఒక కాలు పెట్టి, మొండి బండల వెనుక దాక్కుంటూన్న సూర్యబింబాన్ని పరాగ్గా చూస్తూ నిలబడ్డాడు. పొడుగాటి బొమ్మజెముడు మట్టను చిందర వందరగా చీలుస్తూ ఆలోచించసాగాడు.

అతనిలో రగులుతూన్న ఆగ్రహావేశాలకు చేతిలోని బొమ్మజెముడు బలికాసాగింది. ఆకాశంలో కదుల్తూన్న అకాల మేఘాల్లా—పదమూడు సంవత్సరాలనాటి తన జీవిత దృశ్యాలు కదలసాగాయి.

...'తాను కాలేజీ చదువుతూన్న రోజులు. ఫుట్‌బాల్ ఆడుతూ ఆడుతూ క్రిందబడితే చేతులకు, కాళ్ళకు బలమైన గాయాలు తగిలాయి. గాయాలకు ఎన్ని మందులు వ్రాసినా నయం కాలేదు. చివరకు స్కిన్ స్పెషలిస్ట్ దాన్ని దీర్ఘకాలిక రోగమని నిర్ధారించారు.

ఆరోజు నుండి వెనుక గదుల్లో - పొయ్యి కట్టెలు దాచే గది ప్రక్కన ఒక గది కేటాయించారు తనకు. ఆ రోజు నుండి ఇంట్లో అందరూ యాంత్రికంగా తయారయ్యారు. అవసర మైన మేరకు రెండు మూడు పొడిమాటలు మాట్లాడడం- పనిమనిషితో భోజనం పంపించడం— డాక్టర్‌ని పిలిచి గాయా లకు డ్రెసింగ్ చేయించడం- తన గదిలోకి ఎవర్నీ అనుమ తించకపోవడం— బంధువులు, తెలిసిన వాళ్ళొస్తే తన గది తలుపులు మూయడంవంటి చర్యలు ప్రారంభమైనాయి.

గాలీ, వెలుతురూ రాని ఆ చిన్న గదిలో తాను ఒంటరి తనంతో పోరాడుతూ శరీరాన్ని కొరుక్కుతింటూన్న గాయాలు ఒక వైపు, మనసును కొరుక్కు తింటున్న కారణాలు మరొకవైపు.

ఇంట్లో ప్రశాంతత - నిశ్శబ్దం.

శవాన్ని పారవేసి వచ్చిన వాళ్ళలా అందరిలో మౌనం సైలెన్స్. భయంకరమైన మౌనం-అనంతమైన నిశ్శబ్దం.. మానసిక చిత్రహింస.

ఆ రోజు రాత్రి...బాగా పొద్దుపోయిన తరువాత— రెండు గంటల వేళ. ఆరుబయట మంచాలు. మంచాలపైనున్న వ్యక్తుల కంఠాలు మాట్లాడుతున్నాయి. గాలివాలుకు ఆ మాటలు వినిపిస్తున్నాయి.

''ఏమండీ...నిద్ర పట్టడం లేదా?'' అమ్మ గొంతు.

''నిద్ర ఎట్లా పడుతుంది చెప్పు. మన ఇంటావంటా లేని ఈ రోగం మా వైపుగానీ, మీ వైపుగానీ మామ్మారిలా దాపురించింది. దీన్ని ఎన్నాళ్ళని రహస్యంగా దాచి పెడతాం చెప్పు. ఒక రోజు కాకపోతే మరొక రోజు బంధువులందరికీ తెలిసిపోతుంది. ఇక మనవాళ్ళెవరూ మన గడప తొక్కరు. ఒక వేళ తొక్కినా, పచ్చి మంచినీళ్ళు ముట్టరు.

నిశ్శబ్దం... సమాధానం లేదు. తాను చెవులు రిక్కించాడు.

పెరట్లో కొబ్బరాకులు కదిలిన చప్పుడు. గదిలో చీకటిలో



కిటికీ చువ్వలు పట్టుకొని తాను. ఆకాశంలో లజ్జతో, సిగ్గుతో ముఖం మబ్బుల చాటున దాచుకుంటున్న ఒంటరి చంద మామ.

"ఏమిటో కర్మ" ... నిట్టూర్పు-వొసలు కొట్టుకోవడం.

"ఎన్ని జన్మల పాపమో, వీడు మనకు కడుపునబుట్టాడు: వీడ్నిక్కడే వుంచితే మన పిల్లలకు పెళ్ళిళ్ళు చేయలేము. ఇదొక గుండె కుంపటి. వీడ్ని ఎక్కడన్నా మారుమూల ప్రాంతాలలో వున్న ఆస్పత్రులలో చేర్పించుదాం...రోగం నయమయినా, కాకపోయినా వీడిక అక్కడే వుంటాడు, డాక్టర్ గారు చెప్పింది విన్నారుగా?...'ఐదారు సంవత్సరాలు మందులు వాడితేగాని ఈ రోగం బాగవదు' అన్నాడు. వీడుండగా మనం పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలను బయటికి పంపించలేం. క్రిష్టియన్ ఫాదరీలు ఈ రోగుల కోసం ఎక్కడో అడివిలో ఆస్పత్రి కట్టించారట.... ...అక్కడ పడవేస్తే...చావనివ్వు...బతక నివ్వు"... ... అమ్మ గొంతు.

ఇక వినలేకపోయాడు తాను. 'ఏం చెయ్యాలన్న' - ఆలోచనతో వెల్లికిలా పడుకున్నాడు. గోరువెచ్చని కన్నీళ్ళు కణతల మీదుగా జారిపోయాయి. చివరకు ఒక నిర్ణయాని కొచ్చి లైటు వేశాడు. పెన్, పేపర్లూ అందుకొని రెండు వాక్యాలు వ్రాశాడు. "అమ్మా...నాన్నా"- అని సంబోధించ డానికి మనసొప్పలేదు.

'నా కోసం దిగులు పడకండి. దిగులుపడరని నాకు తెలుసు. నేను శాశ్వతంగా మీకు దూరమైపోతున్నాను. ఈ రోజు నుండి నా వలన మీరనుభవిస్తున్న గుండె బరువు తగ్గిపోతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమిస్తారనడం సత్యం - కానీ నల్లని పిల్లలను, అంగవికలులను, రోగిష్టి పిల్లలను ఏ తల్లిదండ్రులు కూడా ఆదరించరన్నది —

> అమ్మ
>
> ఎప్పుడూ మారే చంద్రునిలా అమ్మ
> ఎప్పుడూ మారని
> చంద్రకాంతి ఆప్యాయతతో అమ్మ
>
> —జింబో

అసత్యం కాదనుకుంటాను...'

ఇట్లు,
కొడుకు

చివరిసారిగా ఆ ఇంట్లో అందరి ముఖాలూ చూడదల్చు కున్నాడు తాను. వాళ్ళకు తానేమీ కానప్పుడు - తనకు వాళ్ళతో పనేమిటని-ఎవరి ముఖాలూ చూడకుండా పెద్ద పెద్ద అంగలు వేస్తూ - గడప దాటాడు.

చేతిలో వున్న బొమ్మజెముడు మట్టను చిదురు, చిదురుగా చీల్చి ముళ్ళతీగెపై వేలాడతీశాడు. గడ్డిపోచను పీకి, మెల్లమెల్లగా కొరుకుతూ మళ్ళీ స్మృతులను నెమరువేసికో సాగాడు.

ఆకలితో, అలసటతో, నిద్రతో తిరిగిన రోజులు. రైల్వే స్టేషన్లలో, పార్కుల్లో-శిథిలావస్థలో వున్న ఇళ్ళలో తల దాచుకున్న రాత్రిళ్ళు. తనను దరిదాపులకు రానివ్వక దూరంగా వెళ్ళగొట్టిన స్థలాలు - ఆకలికి తట్టుకోలేక, కళ్ళముందు చీకట్లు కమ్ముతూంటే నీరసంతో కాళ్ళు తేలిపోతూంటే కాళ్ళీడ్చుకుంటూ తిరిగిన వీధులు. పట్టెడు మెతుకుల కోసం తాను సహించిన అవమానాలు...అన్నీ కళ్ళముందు గిర్రున తిరుగసాగాయి.

ఆరోజు...మూడు సంవత్సరాల తరువాత-సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో, ఓ తల్లి పూరీలు చుట్టిన పాకెట్ ఇచ్చింది. పూరీలు తిని పేపరు పడవేయబోతూంటే అందులో తన ఫోటో పైన 'అబిచ్యురి' అని వ్రాసిన అక్షరాలు.

'సంస్మరణ—' మూడు సంవత్సరాల క్రితం మమ్ము లను దుఃఖసాగరంలో ముంచి వెళ్ళిన మా కుమారుడు...

తన చావును చరిత్రలో రికార్డు చేస్తూ కన్నలు-మూడవ సంస్మరణ. తన మరణాన్ని లోకం గుర్తించడానికి 'సెరిమనీస్!' తన మరణాన్ని ప్రచారం చెయ్యడానికి పేదవాళ్ళకు అన్న దానం. తన మృత్యువును కొలుస్తూన్న మైలురాళ్ళు-కర్మలు ... ...

గడ్డిపోచ కొరికి కొరికి క్రింద పడవేశాడు.

భుజంపై చెయ్యి పడింది. వెనక్కి తిరిగి చూశాడు. మిత్రుడు.

"సత్యం...నీవిక్కడున్నావా?...రూమ్స్ అన్నీ వెతికాము-నడువ్" అన్నాడు.

* * *

దూరం నుంచి వస్తూన్న వాళ్ళిద్దరూ 'మైక్' నుండి వినిపిస్తూన్న మాటలు ఆలకిస్తూ హాలు వద్దకు మెల్లగా నడువసాగారు. మంత్రిగారి ప్రసంగం ముగుస్తోంది. ...... "అంచేత తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఈ జబ్బును అరికట్టడంలో సమష్టిగా కృషిచెయ్యాలి".

మైక్‌లో చప్పట్లు — ప్రతిధ్వనులు.

తరువాత జడ్జిగారి ప్రసంగం వినిపించసాగింది.


MATRIMONIAL

*Gazetted Officer seeks Matrimonial Alliance to his only son from parents of business line preferrably in Madras, Bangalore or Hyderabad. He owns 3 lakhs of property. Boy is good looking from educated family, Hight 5' 6" complexion medium, Age 24, Educational Qualification B.Com., wants to sett le the boy in business line with good investment. Parents belonging to Kapu, Naidu, Telaga or Balija please contact.*

Box No. 104

ANDHRA JYOTI WEEKLY

VIJAYAWADA - 10.

వనితా జ్యోతి

సచిత్ర మాసపత్రిక

వనితాభ్యుదయానికి అత్యున్నత రాజపథం 'వనితాజ్యోతి' నెలనెలా పఠనం





వనితల మనోభావాలను ప్రతిబింబిస్తూ మిమ్ములరిస్తున్న ఉత్తమ శ్రేణి పత్రిక

''నేను దీనిని ఆరోగ్య సమస్యగా కాక సాంఘిక సమస్యగా ఆలోచిస్తున్నాను. ఈ వ్యాధితో బాధపడుతున్నవారు సాటి మనుషుల నిరాదరణకి గురవుతామన్న భయంకొద్దీ రహస్యంగా దాచిపెడుతున్నారు. ... అందువలన, వారిపట్ల నిరాదరణ చూపకుండా ప్రేమగా వ్యవహరించాలి''—

చప్పట్లతో హాలు రేకుల ప్రతిధ్వని.

''ఇప్పుడు జడ్జిగారి సతీమణి ... ఆశ్రమవాసులందరికి చీరెలు, ధోవతులు పంచిపెడతారు. వారి కుమార్డు కృష్ణశర్మ జ్ఞాపకార్థమై వెయ్యి రూపాయిల విరాళాన్ని మన ఆశ్రమానికి అందిస్తున్నారు'' ... సెక్రటరీ అనౌన్స్‌మెంట్ మైక్‌లో. సత్యం, అతని మిత్రుడు హాలు మెట్లెక్కి హాల్‌లోనికి వచ్చారు. వేదికపైనున్న అతిథులు స్పష్టంగా కనిపిస్తున్నారు. మైక్ ముందు సెక్రటరీ.

మైక్ ప్రక్క జడ్జిగారి భార్య ఆశ్రమవాసుల చేతుల్లో చీరెలు, ధోవతులు ఎత్తి ఎత్తి జాగ్రత్తగా జారవిడుస్తోంది. మధ్యలో ఉమంత్రి. మంత్రికి అటూ, ఇటూ డాక్టర్స్.

బట్టల ప్రదాన కార్యక్రమం ముగిసింది. జడ్జిగారు, వారి సతీమణి కృతజ్ఞతలు అందుకున్నారు.

''సత్యమూర్తీ...స్టేజీమీదకు రా...అమ్మా...ఇందాక మీరడిగిన సత్యం ఇతడే'' ......సెక్రటరీ పరిచయం చేశాడు.

''నమస్తే...''చేతులు జోడించాడు సత్యం.

సన్నగా పొడుగ్గా వున్న వేళ్ళు. ఎండిన వగుడాకులా వున్న శరీరం-ఓపెన్ షర్ట్, పైజమా...పొడుగాటి ముక్కు ... వంకల జుట్టు. అంతరించిన అనారోగ్యం.

జడ్జిగారి భార్యకు ఒళ్ళు జల్లుమంది.

ఆమె గుండెల్లో పూ్యజులు ఎగిరిపోయాయి. కాళ్ళు గజగజలాడాయి. పెదవులు తడబడ్డాయి. సూటిగా చూస్తున్నాయి అతని కళ్ళు. అతని కళ్ళలోని 'ఎక్సరే' కిరణాలు అదృశ్యంగా ఆమె హృదయంలోకి చొచ్చుకుపోయాయి. అతని చూపుల తాకిడికి తట్టుకోలేని ఆమె చూపులు-వలలో పడిన చేపల్లా గిలగిలా కొట్టుకున్నాయి.

''ఏ ఊరు మీది'' లాంఛనంగా పల్కరింపు.

''అడుక్కుతినేవాళ్ళకు స్వంత ఊరేముంటుందండీ'' ఆ మాటల్లో గాంభీర్యం-స్పష్టత-కర్కశత్వం-వ్యంగ్యం ప్రతిధ్వనిస్తు న్నాయి.

''మీ అమ్మా, నాన్నలున్నారా?'' లాంఛనప్రాయమైన మరొక ప్రశ్న.

''నాకు తెలియదండీ''.

''నీ తల్లిదండ్రులు నీకే తెలియదా?'' ... [illegible] క్రాస్ ఎగ్జామినేషన్ ... భార్యను కలవరపాటు నుంచి [illegible].

''ఆ విషయం నన్ను కన్నవాళ్ళకే ఎక్కువ తెలుస్తుంది... నాకన్నా'' అంటూ వేదిక దిగి వెళ్ళిపోయాడు.

ఆమెను ఎవరో చెంపపెట్టు పెట్టినట్లు ముఖంలో రక్తం గడ్డకట్టుకుపోయింది. చుట్టూ చీకట్లు- పాలనురగలాంటి ఫ్లోరో సెంట్ దీపాలు కనురెప్పలు టపటపలాడించి మేల్కొన్నాయి. ఆమె మస్తిష్కంలో పేరుకొన్న చీకటిని పారద్రోలుతూ స్మృతుల మెరుపులు. పదమూడు సంవత్సరాల క్రితం మనసు పొరల క్రింద పూడుకుపోయిన మాతృ హృదయం గిలగిలా తన్నుకుంది.

దిక్కుతోచక హాలంతా కలయచూసింది.

గోడలపై చిత్రాలు ...

సత్యమూర్తి...ప్రేమమూర్తి.

రోమన్ చక్రవర్తుల క్రౌర్యానికి బలయిన జీసస్, శిలువను భుజాన వేసికొని భారంగా అడుగులు వేస్తూ, దైన్యం నింపుకున్న కళ్ళతో ఆకాశం వంక చూస్తూ ముందుకు వెళ్తూన్న పెద్ద చిత్రం.

గాంధీజీ తన మిత్రుడైన సంస్కృత పండితుని కాళ్ళకు [illegible] పూస్తూన్న మరో రంగు చిత్రం...ఇంకా ఎందరో మహనీయుల చిత్రాలు.

సెక్రటరీ మైక్‌లో ఏమన్నాడో ఆమెకు వినిపించలేదు.

అందరూ స్టేజీ దిగిపోతూంటే భార్యాభర్త లిరువురూ గబగబా బట్టలు దులుపుకొని కారు వద్దకు నడిచారు. 'వీడ్కోలు' అందుకొని కారులో కూలబడి సీటులో కూరుకుపోయారు.

''ఈ సత్యమనేవాడు... మన కృష్ణశర్మలా లేడూ?'' ... ఆమె పెదవులింకా ఒణుకుతున్నాయి.

''అవును...అయితే వాడు చనిపోలేదన్నమాట'' ... భర్త సందేహం.

ఆకాశం నుండి అదృశ్యమైన ఏదో 'స్కైలాబ్' నెత్తిపై కూలిపోతున్నట్లుగా, ఆ శకలాల క్రింద వారు నలిగిపోతూన్న అనుభూతితో ఇద్దరూ ఆకాశంకేసి చూసి గాజు ఫలకాలు పైకెక్కించుకున్నారు. కదిలిపోతూన్న కారుకు చేతులూపుతున్నారు ఆశ్రమవాసులు.

గేటు దాటి కారు మలుపు తిరిగింది. ఆమె వెనుతిరిగి చూసింది.

ఆశ్రమవాసులు బయటికి రాకుండా — పహరా కాస్తోంది ముళ్ళతీగె. ●

# జంపన పెద్దిరాజు స్మారక కథలపోటీ

కీర్తిశేషులు జంపన పెద్దిరాజు జ్ఞాపకార్థం జంపన శ్రీగిరిరాజు నిర్వహిస్తున్న కథల పోటీ నిమిత్తం సాంఘిక ప్రయోజనం, సామాజిక చైతన్యం కలిగిన కథలను రచయితల నుంచి ఆహ్వానిస్తున్నారు.

## బహుమతులు

మొదటి బహుమతి రు. 1000

రెండవ బహుమతి రు. 500

* మొత్తం రు. 1500 నగదు బహుమతులు నిర్ణయించిన ఈ పోటీకి పంపే రచనలు నిడివి 9, 10 ఫుల్‌స్కేప్ పేజీలకు మించరాదు.
* రచయితలు, రచయిత్రులు కథతోపాటు తమ పూర్తి చిరునామాను, రచన దేనికీ అనుకరణ, అనుసరణ, అనువాదం కాదని, అముద్రితమన్న హామీని జత చెయ్యాలి.
* రచనలు తిప్పి పంపడం సాధ్యపడదు.
* బహుమతి పొందిన కథలు రెండింటిని ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1987 సంక్రాంతి సంచికలో ప్రచురిస్తాము.
* బహుమతి పొందిన కథలు కాక, సాధారణ ప్రచురణకు యోగ్యమైన రచనలను ఎంపిక చేసి, వీలువెంట ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో ప్రకటిస్తాము.
* శ్రీయుతులు సైమ్మల్, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ వెల్చేరు నారాయణరావుల సానుభూతి సహకారంతో నిర్వహిస్తున్న ఈ కథల పోటీకి తుది తీర్పు సంపాదకునిదే. దీనిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం సాధ్యపడదని మనవి.

## గడువు తేదీ

మీ రచనలు మా కార్యాలయానికి చేరవలసిన ఆఖరు తేదీ

31 డిసెంబర్, 1986

- ఎడిటర్

చిరునామా:
జంపన పెద్దిరాజు స్మారక కథల పోటీ,
కేరాఫ్ ఎడిటర్,
ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక,
పోస్ట్‌బాక్స్ నెం: 712,
లబ్బీపేట, విజయవాడ- 520 010.